
సామర్లకోటలో పెరిగిన తుప్పలు


పరదా తీయని జగన్ : కోరుకొండలో బస్ లోపల నుంచే అభివాదం

జగన్ పాతపాటే

- నీరసంగా ప్రసంగం.. కొత్త హామీల ఊసేలేదు
- జగన్ ప్రసంగం .. జనం తిరుగుముఖం
- కోరుకొండలో సీఎం సిద్ధం సభ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/కోరుకొండ/రాజానగరం/సీతానగరం, మే 7: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగం చప్పగా సాగింది. రాజానగరం వైసీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట ప్రధాన వీధిలో మంగళవారం సిద్ధం సభ జరిగింది. ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో అత్యధికంగా జనాన్ని తరలించారు. ఒక్కో మండలానికి 50కిపైగా బస్సులు వేసినట్టు చెబుతున్నారు. ఉదయం 10.30 గంటలకే సీఎం జగన్ సభ ఆరంభమవుతుందని చెప్పినా గంట ఆలస్యంగా 11.30 గంటలకు ఆయన ప్రసంగం మొదలైంది. 3 గంటల పాటు మండుటెండలో ప్రజలు అల్లాడిపోయారు. సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే వెనుదిరిగి బస్సుల వద్దకు వెళ్లిపోయారు.జగన్ ప్రసంగంలో ఐదేళ్లలో తానెంతో చేశానని చెప్పడమే కానీ, ఒక కొత్త పథకం ఊసు ఎత్తలేదు. పాత పాటే పాడారు. చంద్రబాబుపై విమర్శలకు బాగా సమయం కేటాయించారు. తనను దెబ్బతీయడానికి సూపర్‌సిక్స్ మేనిఫెస్టో తెచ్చారని, అది అబద్ధాల మేనిఫెస్టో అని ఆయన చెప్పడానికి ప్రయత్నించారు. 1న పింఛన్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా చంద్రబాబువల్లే సకాలంలో ఇవ్వలేదని ఆరోపించారు. కోరుకొండ ఊరులోని ఇళ్లు, షాపులు, భూములకు రిజిస్ట్రేషన్లు లేని సంగతి తెలిసిందే. ఎక్కువ భూములు దేవస్థానానికి చెందడంవల్ల గత ఎన్నికల ముందు రిజిస్ట్రేషన్లు చేయిస్తామని మాటిచ్చారు. కానీ ఎవరూ ఊహించకుండా ఎన్నికల షెడ్యూల్ ముందుగానే వచ్చేయడంవల్ల వీటి పని మధ్యలో ఆగిపోయిందని, తాను మళ్లీ నెగ్గిన తర్వాత పూర్తి చేస్తానని ప్రకటించడం గమనార్హం. ఇక్కడ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను గెలిపిస్తే ఏకంగా రాజా తల్లి, తమ్ముడుతో పాటు రాజా, గణేష్ సతీమణులు కలిపి మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలుగా పనిచేస్తారని చెప్పడం చర్చనీయాంశమైంది. వైసీపీకి ఓటు వేస్తేనే పథకాలు కొనసాగుతాయన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో బస్సులు ఆపేయడంతో జనం నడవడానికి ఇబ్బంది పడ్డారు. జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే చాలా మంది తిరుగుముఖం పట్టారు. సీఎం ప్రసంగం ముగించే సమయంలో గాలి, వాన ఆరంభమైంది. సీఎం సభ కారణంగా కోరుకొండలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ నిలిపివేశారు. దీంతో కోరుకొండ, జంబూపట్నం గ్రామస్తులు అవస్థలు పడ్డారు. సిద్ధం సభకు వచ్చిన సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన మోర్త శ్యామ్‌కుమార్ వానకు తడవకుండా ఉండడానికి అంబేడ్కర్ విగ్రహం శ్లాబ్ కిందకు వెళ్లగా అది కూలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు పృథ్వీరాజ్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు.


ఉండలేం..వినలేం : సభ జరుగుతుండగానే బస్టాండ్ వద్దకు చేరిన జనం

పేదింటికి జగన్ చెద!


చూడు..గూడు : నిడదవోలులో శిథిలావస్థకు చేరిన టిడ్కో ఇళ్లు
రామచంద్రపురంలో చెద పట్టిన తలుపులు

పేదింటిని జగన్ దగా చేశాడు.. కక్షతో చెదలు పట్టించాడు.. ఐదేళ్ల కిందట తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 80 నుంచి 90 శాతం నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయించాడు.. నాలుగేళ్ల తరువాత తాపీగా ఎన్నికల వేళ లబ్ధిదారులకు ఇచ్చారు. ఏదో అంతా మేమే చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు.. అసలు విషయం చూస్తే.. అధికారం చేపట్టిన వైసీపీ కేవలం టీడీపీ ప్రభుత్వం కట్టిందన్న కక్షతో ఆ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా నాలుగేళ్ల పాటు ఆటలాడుకుంది. దాంతో గోడలు పగుళ్లివ్వడం, విద్యుత్ వైర్లు, పరికరాలు చోరీకి గురికావడం, గుమ్మాలు, ఇతర సామగ్రి దెబ్బతినడం వంటివి చోటుచేసుకున్నాయి. ఇప్పుడు అపార్ట్‌మెంట్లల్లోకి గృహప్రవేశం చేసినవారు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. సౌకర్యాలు లేక, దుర్గంధపూరిత వాతావరణంలో ఉండలేక అవస్థలు పడుతున్నారు.

- పేదల గూడు.. వైసీపీ నిర్లక్ష్యం చూడు
- టీడీపీ కట్టిందన్న కక్షతో తీవ్ర నిర్లక్ష్యం
- శిథిలమవుతున్న టిడ్కో అపార్ట్‌మెంట్లు
- సొంతిల్లు సమకూరిందన్న ఆనందం ఆవిరి
- లబ్ధిదారుల అవస్థలు
- వైసీపీ పగ ఫలితమిది


పిఠాపురంలో టిడ్కో గృహాలు

పిఠాపురాన వసతుల లేమి..

పిఠాపురం, మే 7: పేదలను జగన్ దగా చేశాడు.. ఒక్క ఛాన్స్ అంటే నమ్మి గెలిపిస్తే వారికే పంగనామాలు పెట్టాడు. పూర్తయిన ఇళ్లకు నాలుగేళ్ల చెదలు పట్టించాడు.. చివరికి రేపుమాపూ అంటూ ఎన్నికల వేళ నాలుగేళ్ల తరువాత ఇచ్చాడు. అయితే ప్రస్తుతం కొంత మంది పేదల్లో సొంతింటిలోకి వచ్చామన్న ఆనందం మచ్చుకైనా కానరావడం లేదు. అద్దె ఇంట్లోనే ఉంటే బాగుండేది. లక్షలాది రూపాయలు వడ్డీ రూపంలో నష్టపోయి కష్టాలు కొని తెచ్చుకున్నామన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని టిడ్కో అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారందరి పరిస్థితీ ఇదే. కనీస నిర్వహణ లేక.. సమస్యలు ఎవ్వరు పట్టించుకోక వారు ఇబ్బందులకు గురవుతున్నారు. పిఠాపురం-గోర్స రోడ్డులో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 864 అపార్ట్‌మెంట్లు నిర్మించారు. వీటిని మూడు రకాల విస్తీర్ణాల్లో నిర్మించి లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో అపా కేటాయించారు.ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాలుగేళ్ల పాటు వాటిని పట్టించుకోకుండా వదిలేశారు. ఇటీవల 441 మంది లబ్ధిదారులు రుణాలు పొందేందుకు అర్హత పొందగా, అందులో 350 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి అపార్ట్‌మెంట్లు అప్పగించారు. కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.


మండపేటలో కాలనీ మధ్యన మురుగునీరు
అల్లవరంలో టిడ్కో ఇంటి రోడ్డుపై మురుగునీరు

మండపేటలో రంగులు మారాయి.. వసతుల్లేవ్

మండపేట, మే 7: నాలుగేళ్లకు ఇళ్లిచ్చారు.. అయితే వసతులను మాత్రం మరిచారు. మండపేటలో గత ప్రభుత్వ హయాంలో 4064 ఇళ్లను నిర్మించారు. ఫేజ్-1లో 3200 మందికి ఇళ్లను అందించగా వసతులు లేక 50 శాతం మంది కూడా మకాం రాలేదు. మరో 800 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు కాలేదు.ప్రభుత్వం మారిన తర్వాత రంగులంటే మారాయి తప్ప నేటికీ వరకు పేదలకు ఇళ్లను అందించి వసతులు కల్పించిన దాఖలాలు లేవు. ఫేజ్-2లో 20 68 గృహాలు పూర్తయినా నేటికా లబ్ధిదారులకు అందజేయలేదు. బ్యాంకుల నుంచి వాయిదాలు చెల్లించాలని నోటీసులివ్వడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

అల్లవరంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

అల్లవరం, మే 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రులోని టిడ్కో భవనాల్లో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ రూ.113 కోట్లతో 2019 ఫిబ్రవరి 9న టిడ్కో భవనాలు ప్రారంభించారు. 1,632 కుటుంబాలు నివసించేలా భవనాలు నిర్మించినా 545 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. తాగునీటి సమస్య అధికంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు పారట్లేదు. వర్షాకాలంలో వైనతేయ వరదనీరు పోటెత్తడంతో రోడ్లు మునుగు తున్నాయి. సి-6 భవనంలో స్లాబ్ లీకేజీ అవుతోంది. అసాంఘిక కార్యకలపాలకు కొన్ని ప్లాట్లు అడ్డాగా మారాయి.

పెద్దాపురం, సామర్లకోటల్లో ఇళ్లెప్పుడిస్తారో..

సామర్లకోట/పెద్దాపురం, మే 7: పెద్దాపురం నియోజకవర్గం పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో 4,368 టిడ్కో గృహాలు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. రెండు పట్టణాల్లోనూ లబ్ధిదారులు గత ప్రభుత్వ హయాంలోనే సామూ హిక గృహప్రవేశాలు చేసుకున్నారు. ఈలోపు ఎన్నికలు రావ డంతో లబ్ధిదారులకు స్వాధీనం చేయలేకపోయారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు అప్పగించకుండా తాత్సారం చేసింది. సామర్లకోటలో జగ్గమ్మగారిపేట లేఅవుట్‌లో 272 ఫ్లాట్‌లు, ఉప్పువారి సత్రం వద్ద 361 ఫ్లాట్‌లు నిర్మించారు. వీటిలో ఇప్పటివరకూ కేవలం 33 ఫ్లాట్‌లను మాత్రమే లబ్ధిదారులకు స్వాధీనపరిచారు. పెద్దాపురం పట్టణ శివారు వాలు తిమ్మాపురం వెళ్లే రహదారిలో మొదటి విడతలో 1728, రెండో విడతలో 1585 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మొదటి విడతలో నిర్మించిన ఇళ్లలో 1460 మందికి మాత్రమే పంపిణీ చేశారు. మిగిలినవాటిని ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఆయా గృహసముదాయాల్లో మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారు. పైగా నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు.


రామచంద్రపురంలో తుప్పల్లో వ్యాయామ పరికరాలు

రామచంద్రపురాన చెదలు


పిఠాపురంలో పెరిగిన తుప్పలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 7: పేదలకు తక్కువ ఖర్చుతో గృహాలు అందించాలన్న ఉన్నతాశయానికి చెదలుపట్టింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తయినప్పటికీ తదుపరి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించకపోవడంతో ఇప్పటికీ పలు ఫ్లాట్లు లబ్ధిదారులకు అందలేదు. రామచంద్రపురంలో తొలివిడత నిర్మించిన 1098 ఫ్లాట్లలో చాలా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తలుపులు, గుమ్మాలు పూర్తిగా చెదలుపట్టి ఊడిపడిపోయాయి. బ్యాంకు రుణాలకు డాక్యుమెంటేషన్ పూర్తికాకపోవడం, వివిధ కారణాలతో ఫ్లాట్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. దీంతో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న గృహాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అయినా పట్టించుకునేవారే లేరు.

నిడదవోలులో ఐదేళ్లుగా ఇంతే!

నిడదవోలు, మే 7: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదలందరికీ గృహాలు అందించాలనే లక్ష్యంతో నిడదవోలు పట్టణం తీరుగూడెం సమీపంలో 2017-18 సంవత్సరంలో 1152 మందికి టిడ్కో గృహాలు నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కావొస్తున్న దశలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే టిడ్కో గృహాల నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. నేటికీ లబ్ధిదారులకు అందించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. టిడ్కో గృహాల కోసం పేదలైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

అకాల వర్షం

- జిల్లాలో ఈదురుగాలుల విధ్వంసం
- తడిసి ముద్దయిన ధాన్యం రాశులు
- రైతులకు తీవ్ర ఇబ్బందులు -వివరాలు 6లో

సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమం



- ప్రచారంలో ప్రజల స్పందన చాలా ఆనందం కలిగించింది
- నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం -వివరాలు 7లో

తొలిసారి తుని టీడీపీ నుంచి మహిళగా, యనమల బిడ్డగా ప్రజల్లోకి వెళ్లినప్పుడు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించిందని తుని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న యనమల దివ్య అన్నారు. ఆమెతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

- తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య

ఏపీఈఏపీ సెట్‌కు 3,61,401 దరఖాస్తులు

- హాల్‌టికెట్లు విడుదల
- 16 నుంచి 23 వరకూ పరీక్షలు
- కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి

జేఎన్టీయూకే, మే 7: రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్న ఏపీఈఏపీ సెట్‌కు ఇప్పటివరకూ మొత్తం 3,61,401 దరఖాస్తులు వచ్చినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,72,881 మంది, అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 87,309 మంది, రెండింటికీ 1211 మంది దరఖాస్తు చేశారన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను విడుదల చేశామని విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్‌ను ఎంటర్ చేసి హాల్‌టికెట్లను పొందవచ్చని తెలిపారు. రూ.5,000 ఆలస్య రుసుముతో ఈనెల 10వరకూ, రూ.10,000తో 12 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు 16 నుంచి 17 వరకూ, ఇంజనీరింగ్ పరీక్షలు 18 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని హాల్‌టికెట్లను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2342499, 2359599 నెంబర్లలో సంప్రదించాలన్నారు.


అభ్యర్థితో.. ఒకరోజు
సామర్లకోటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తంగెళ్ల ఉదయ్

అటు ప్రణాళికలు.. ఇటు ప్రచారాలు..


టీ తాగుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి ఉదయ్

ఎన్నికలకు ఇక ఐదురోజులే మిగిలింది. ఈ నేపథ్యంలో కాకినాడ పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. క్షణం కూడా తీరిక లేకుండా బిజీబిజీగా ఉన్న ఉదయ్‌శ్రీనివాస్‌తో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒక రోజు' నిర్వహించింది. ఆయన ఉదయం కాకినాడ విద్యుత్‌నగర్‌లోని జనసేన కార్యాలయంలోనే ఉదయం 5గంటలకే నిద్ర లేచారు. గంటపాటు వ్యాయామం చేశారు. 9గంటలకే పార్టీ శ్రేణులతో కలిసి ప్రచార వ్యూహాలపై సమాలోచనలు చేశారు. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. మధ్యాహ్నం 2గంటల వరకు కాకినాడలోనే ప్రచారాల్లో పాల్గొన్నారు. భోజనం విరామం తర్వాత మధ్యాహ్నం 2.30గంటలకు కాకినాడ రూరల్ నియోజకవర్గం కరపలోను, సాయంత్రం 5గంటలకు పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం పి.వేమవరంలోను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అక్కడ 7గంటల వరకు ప్రచారం చేపట్టి రాత్రి 8గంటలకు ముగించి ఇంటికి చేరుకున్నారు. -వివరాలు 7వపేజీలో..

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 12,329 ఓట్లు

- కలెక్టర్ నివాస్.. పీఆర్ డిగ్రీ కళాశాలలో పోస్టల్ ఓటింగ్ పరిశీలన
- ఓటుహక్కు వినియోగించుకున్న ఎస్పీ సతీష్‌కుమార్ -వివరాలు 8లో


ఓటుహక్కు వినియోగించుకున్న ఎస్పీ సతీష్‌కుమార్

కుడి ఎడమైతే..


గెద్దం మహాలక్ష్మి


నయినాల గణేశ్వరరావు

అమలాపురం రూరల్, మే 7: కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..అన్నాడో సినీ కవి. అది అక్షర సత్యం చేసిన నాయకులున్నారు. 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం గ్రామానికి చెందిన గెడ్డం మహాలక్ష్మి రాజోలు ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి 30,460 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పక్కనే ఉన్న నగరం నియోజకవర్గం నుంచి మామిడికుదురు గ్రామానికి చెందిన నయినాల గణేశ్వరరావు అదే పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. దాంతో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం జనరల్‌గాను, నగరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగాను మారిపోయాయి. దాంతో అప్పటి కాంగ్రెస్ అధిష్ఠానం ఈయన్ని అటు ఆయన్ను ఇటు పంపించి పోటీ చేయించారు. నగరం నుంచి గెడ్డం మహాలక్ష్మి, రాజోలు నుంచి నయినాల గణేశ్వరరావులు ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అందుకేనేమో కుడి ఎడమైతే పొరపాటు లేదనేది.

నిఘా నేత్రం

● ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల వాహనాలకు సీసీ కెమెరాలు


కెమెరాతో కారు

పిఠాపురం/పెద్దాపురం, మే 7: నిఘాపై నిఘా నేత్రం. ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ప్రలోభాలు, నియమావళి ఉల్లంఘనలు సహ అన్నిరకాల అంశాలను పరిశీలించే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పనితీరులో పారదర్శకత తీసుకువచ్చేందుకు వారి వినియోగించే వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిని బట్టి ప్రతి నియోజకవర్గంలో గెజిటెడ్ అధికారుల నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒక స్క్వాడ్ విధులు నిర్వర్తించేలా నియోజకవర్గానికి తొమ్మిది నుంచి 15 స్క్వాడ్‌ల వరకూ ఏర్పాటు చేశారు. వీరికి అదనంగా జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపై ముఖ్య ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్కడ ఎస్ఎస్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. వీరందరికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహన సౌకర్యం కల్పించారు. ప్రతి స్క్వాడ్‌లో గెజిటెడ్ అధికారితో పాటు ఒక కానిస్టేబుల్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. వారు నిరంతరం వాహన తనిఖీలతో పాటు ఎన్నికల నియమావళి అమలు జరుగుతున్న తీరు, ఎన్నికల ప్రచార వాహనాల అనుమతులు, అభ్యర్థులు, పార్టీల తరపున ప్రచారాలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలకు అనుమతులు ఉన్నాయా, ఉంటే వాటిని పాటిస్తున్నారా, నగదు, బంగారం, ఇతర వస్తువుల తరలింపులు తదితర అంశాలను పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఉంది. వీరు విధులు నిర్వర్తించే సమయంలో తప్పనిసరిగా వీడియోగ్రఫీ తీయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తద్వారా వీరు జరిపే తనిఖీలకు సంబంధించిన అన్ని అంశాలను ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించడానికి వీలు ఏర్పడింది. ఏమైనా ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పుడు సీసీ ఫుటేజీల ఆధారంగా పరిశీలన జరపాలని ఎన్నికల కమిషన్ నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. అదే విధంగా చెక్‌పోస్టుల వద్ద రహదారులకు అనుగుణంగా రెండు, మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు, అన్నిరకాల వాహన తనిఖీలు ఈ కెమెరాల్లో రికార్డవుతాయి. తద్వారా తనిఖీల్లో పారదర్శకత ఉంటుందని అధికారులు తెలిపారు.

పింఛన్ డబ్బులు అందించి ఆశీర్వదించి


పింఛన్ డబ్బు అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మే 7: ఎమ్మెల్యేగా గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వామ్యం కావడంతో పాటు తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఈనెల వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలను కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు దైవాల సత్యవతి అనే వృద్ధురాలు విరాళంగా అందించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ముంజవరంలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది..

పవన్‌కు మద్దతుగా జబర్దస్త్ బృందం ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న రైజింగ్ రాజు

ఉప్పాడ (కొత్తపల్లి), మే 7: కూటమి పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా జబర్దస్త్ బృందం, సీరియల్ నటులు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం జరిగింది. జబర్దస్త్ హాస్య నటుడు రైజింగ్ రాజు పవన్‌కల్యాణ్ ఎన్నికల గుర్తు గాజు గ్లాసుకు ఓట్లేసి ఘనవిజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని ఎన్‌డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధి కూలీలు


చినజగ్గంపేటలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధి కూలీలు

గొల్లప్రోలు రూరల్, మే 7: కూలీలకు మస్తరు వేసేది ఉపాధి సిబ్బంది. వారు పాల్గొనేది మాత్రం వైసీపీ ఎన్నికల ప్రచారంలో. బహిరంగంగానే కూలీలందరిని ప్రచారానికి వెళ్లమని చెప్పడమే గాక దగ్గరుండి పంపించడంపై టీడీపీ, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఓపెన్‌టాప్ జీపుపై ఆమె ప్రచారం సాగిస్తుండగా నాయకులు, కార్యకర్తలు అనుసరించారు. ఈలోగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లోకి వచ్చిన ఉపాధి కూలీలకు అక్కడ సిబ్బంది మస్తరు వేశారు. వైసీపీ నేతల ఒత్తిడితో వారిని దగ్గరుండి ప్రచారానికి పంపడం విమర్శలకు తావిచ్చింది. బహిరంగంగానే వీరు ప్రచారానికి వెళుతుండటాన్ని గమనించిన టీడీపీ, జనసేన నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడంతో గందరగోళం


కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 7: కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. దరఖాస్తు చేసినప్పటికీ తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చలేదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉద్యోగులు ఎన్నికల అధికారులను నిలదీశారు. కాకినాడ జిల్లా ఎన్నికల విధుల్లో ఉన్న కోనసీమ జిల్లా ఉద్యోగులకు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో వారు కాకినాడ పీఆర్ కళాశాల కేంద్రానికి విచ్చేశారు. తీరా అక్కడికి వచ్చే సరికి కొంతమంది పేర్లు జాబితాలో కన్పించకపోవడంతో గందరగళం నెలకొంది. ఫారం-12 దరఖాస్తు చేసినా ఎందుకు జాబితాలో పేర్లను ఎందుకు చేర్చలేదని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కొంత వాగ్వాదం నెలకొంది. గతంలో జరిగిన ఎన్నికల్లో ఇలాంటి దుస్థితి రాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఉన్న కక్ష నేపథ్యంలో ఓట్లు చేర్చకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ జె.నివాస్ హుటాహుటిన పీఆర్ కళాశాలకు వచ్చారు. ఉద్యోగులతో చర్చించారు. ఎవరికైతే ఓటు లేదో వారికి బుధవారం ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

పవన్ రోడ్‌షో అనుమతులపై మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

● దరఖాస్తులతో పడిగాపులు ● 10న కార్యక్రమంపై వీడని సస్పెన్స్

పిఠాపురం, మే 7: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 10వ తేదీన నియోజకవర్గంలో నిర్వహించే రోడ్‌షో, సభలకు అనుమతుల విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదే రోజు సీఎం జగన్ పిఠాపురంలో పర్యటించనున్నారన్న సమాచారంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల 10వ తేదీన పవన్ రోడ్‌షోకు సంబంధించి ముందుగానే కార్యక్రమం ఖరారయింది. రోడ్‌షో రూట్‌మ్యాప్, రోడ్ కార్నర్ మీటింగ్‌లకు సంబంధించిన రూట్ మ్యాప్‌లతో టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం ఉదయం 9.30 గంటలు-10 గంటల మధ్యలో ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రయత్నించగా సర్వర్ పనిచేయడం లేదంటూ సాయంత్రం వరకూ వెయిట్ చేయించారు. చివరకు సాయంత్రం 6.30 గంటల సమయంలో సర్వర్ పనిచేయడంతో పాటు ఓటీపీ నెంబర్ ఇచ్చారని ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో టీడీపీ, జనసేన నేతల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే రోజు సీఎం జగన్ పిఠాపురంలో సభ నిర్వహిస్తారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పవన్ పర్యటనకు అనుమతి ఇవ్వకుండా చేసేందుకు ఇలా చేశారా అనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సాయంత్రం 5గంటలకు పిఠాపురం ఆర్వో, జేసీ రామసుందరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిపై ముందుగా ఎవరి లెటర్ వస్తే వారి దరఖాస్తునే పరిగణలోకి తీసుకుని అనుమతి ఇవ్వనున్నట్లు జేసీ తెలిపినట్లు వర్మ చెప్పారు. తమకు అనుమతులు వస్తాయని భావిస్తున్నామని తెలిపారు. అయినప్పటికి పవన్ పర్యటనకు అనుమతి విషయంలో అధికారులు ఎలా వ్యవహరిస్తారో అన్న సందేహం టీడీపీ, జనసేన నేతలను వెన్నాడుతున్నది.


మండపేట కపిలేశ్వరపురం రోడ్డులో నేలటూరు వద్ద ధాన్యపు రాశుల మధ్య నీటిని తోడుతున్న రైతు

అకాల వర్షం

అకాల వర్షం రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. టార్పాలిన్లతో పొలాల్లోకి పరుగులు పెట్టించింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు పరుగు పరుగు వెళ్లి వాటిపై టార్పాలిన్లు కప్పుకునే పనిలో పడ్డారు.. కొన్ని చోట్ల చెట్లు నేలకూలాయి..ట్రాఫిక్ స్తంభించింది.

తడిసి ముద్దయ్యింది..

మండపేట, మే 7: మండపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల మండపేట పట్టణం, మండలంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. మండపేట గొల్లపుంత కాలనీలో, కేపీ రోడ్డులో, స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రైతులు ఆరబోసుకున్న ధాన్యం వర్షానికి తడిసిముద్దయింది. రాశులపై కప్పిన బరకాలు గాలులకు ఎగిరిపోయాయి. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా తడిసి ముద్దయిన ధాన్యం కళ్లాల్లో కనిపించింది.

నేలకొరిగిన అరటి


ఆత్రేయపురం మండలం కట్టుంగలో నేలకొరిగిన అరటి పంట

ఆత్రేయపురం, మే 7: వాయుగుండం ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులు వీయడంతో అమలాపురం-బొబ్బర్లంక రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగి రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడిసిముద్దయి ట్రాఫిక్‌ను నియంత్రించుకున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను రైతులు ఒబ్బిడి చేసుకుని బరకాలు కప్పుకున్నారు. కట్టుంగ, అంకంపాలెం, ర్యాలి, ఉచ్చిలి తదితర ప్రాంతాల్లో చేతికి వచ్చిన అరటి పంట నేలకొరిగింది. తాడిపూడి, కట్టుంగతో పాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరిగాయి.

అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ధాన్యానికి బరకాలు కప్పుతున్న రైతులు



ధాన్యం రక్షించుకునే పనిలో..

అంబాజీపేట, మే 7: అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పుకోవడంతో పాటు ఆరబోసినన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో 45శాతం వరి కోతలు పూర్తికాగా రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు.

ధాన్యం రాశులపై బరకాలు


ఈతకోట-గంటి రోడ్డులో ఈదురు గాలులకు బోల్తాకొట్టిన ధాన్యం లోడు ట్రాక్టర్

ఈదురుగాలుల విధ్వంసం

రావులపాలెం, మే 7: రావులపాలెం మండలంలో కురిసిన అకాల వర్షంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరింది. ఈదురుగాలులకు కొబ్బరి చెట్లు, తాడి చెట్లు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈతకోట, గంటి, రాజవరం, పొదలాడ రోడ్డులో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈదురుగాలులుకు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. రావులపాలెం మార్కెట్ రోడ్డు పూర్తిగా జలమయమైంది. ఆర్టీసీ కాంప్లెక్స్, తహసీల్దారు కార్యాలయం రోడ్డు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి.

కె.గంగవరం: పామర్రు ఉన్నత పాఠశాల ఆటస్థలంలో వాననీటిలో ధాన్యం రాశులు



రైతుల ఇబ్బందులు

కె.గంగవరం, మే 7: కె.గంగవరం మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి వరి రైతులు ఇబ్బందులు పడ్డారు. రబీ పంట మాసూళ్లు ముమ్మరంగా జరగుతుండటంతో యంత్రాలతో కోసిన పంటను రైతులు రోడ్లపై, దిమ్మలపై ఎండబోసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేయలేకపోయారు. వాన నీటిలో పంట తడిసిపోయింది. పామర్రు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ధాన్యం ఆరబెట్టి తర్వాత రాశులుగా ఏర్పాటు చేశారు. వర్షం కురవడంతో రాశులు ముంపు బారిన పడ్డాయి. భారీ వర్షంతో వరి పొలాల్లో నీరు నిలిచిపోయింది. ఇంకా కోతలు పూర్తికాని పొలాల్లో మరో వారం రోజులు కోతలు కోసే వీల్లేదు. వర్షానికి తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


అవిడిలో తడిసిన ధాన్యం

ముద్దయ్యాయి..

ధాన్యం రాశులను కాపాడుకునే పనిలో రైతులు



సామర్లకోట, మే 7: సామర్లకోట పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ధాన్యంలో తేమశాతం పోయేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం రాశులు అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయి. అన్నదాతలు కుదేలయ్యారు. సామర్లకోట మండలంలో ధాళ్వా వరిపంట కోతలు సుమారు 90 శాతం పూర్తికాగా ధాన్యాన్ని ప్రభుత్వం సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆరుబయట మైదానాలలో ఆరబెడుతూనే ఉన్నారు. అదే క్రమంలో మంగళవారం సామర్లకోట చెరకు యార్డు కళ్లాలలోనూ, మాండవ్య నారాయణ స్వామి ఆలయం ఎదురుగా మైదానంలోనూ, భీమేశ్వరాలయం రోడ్డుకు ఇరువైపులా, ఏడీబీ రోడ్డు జ్యూయల్ మెడోస్ మైదాన ప్రాంతాల వద్ద ధాన్యాన్ని రైతులు ఆరబోసారు. అయితే వాతావరణం ఒక్కసారిగా మారిపోయి అకాల వర్షం కురుస్తుందని ఊహించలేని రైతులు కళ్లాలలో తడిసిన ధాన్యాన్ని చూసి తీవ్ర ఆవేదన చెందారు.

అన్నదాతల ఆందోళన


అవిడిలో కల్లాల్లోనే ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

కొత్తపేట, ఏప్రిల్ 7: మండలంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలు తెగిపోయాయి. కొబ్బరిచెట్లు పడడంతో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాణిజ్య పంటలైన అరటి, మొక్కజొన్న, బొప్పాయి నేలకొరగగా మామిడితోటలు ధ్వంసమయ్యాయి.

రాజమహేంద్రవరంలో భారీ వర్షం

రాజమహేంద్రవరంలో వర్షం




రాజానగరంలో..

రాజమహేంద్రవరం సిటీ, మే 7 : రాజమహేంద్రవరాన్ని భారీ వర్షం నీట ముంచేసింది. మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు రాజమహేంద్రవరంలో వర్షం ప్రారంభమై సుమారు 2గంటల పాటు కురిసింది. దీంతో నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నగరంలో రోడ్లన్నీ నీట మునిగాయి. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి కృష్ణానగరంలో కారు నీటిలో తేలి కొంతదూరం కొట్టుకుపోయింది. బైక్‌లు, స్కూటీలు నీట మునిగాయి. చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు 3 గంటల పాటు జనజీవనం స్తంభించింది. సుమారు 6 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఇంటర్వ్యూ

సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమం



- ప్రచారంలో ప్రజల స్పందన చాలా ఆనందం కలిగించింది
- నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య

ప్ర. కూటమి అభ్యర్థిగా మీ ప్రచారానికి స్పందన ఎలాఉంది?

జ. తొలిసారి తుని టీడీపీ నుంచి మహిళగా, యనమల బిడ్డగా ప్రజల్లోకి వెళ్లినప్పుడు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించింది. నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని స్వయంగా కలుస్తున్నా. వారి సమస్యలు వింటున్నాం. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు వారి అభిమానం, ప్రేమ నాపై చూపించినప్పుడు చాలా ఆనందం అనిపించింది. వారి ఆశీర్వచనాలతో తునిలో ఎమ్మెల్యేగా సేవలు అందిస్తానన్న నమ్మకం కలిగింది.

ప్ర. పాలకుల తీరుపై ఏమంటారు?

జ. ఐదేళ్ల జగన్ పాలనలో అన్నిరంగాలు కుదేలయ్యాయి. అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. రాష్ట్రమంతా అరాచకం కొనసాగింది. ప్రశ్నిస్తే దాడులు. దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఒక్క పరిశ్రమ రాలేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు. మహిళలకు రక్షణ కరువైంది. రైతులు కష్టాల్లో ఉన్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలు వేయలేని పరిస్థితి. అభివృద్ధి మాటలేని ఈ అరాచక పాలనకు విముక్తి కలిగించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి.

ప్ర. నియోజకవర్గంలో మీ దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలు ఏంటి?

జ. తునిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో తాగునీటి కాలువలు, చెరువులు అతీగతీ లేకుండా పోయాయి. తునికి ప్రధాన సమస్యగా మారిన తాండవ రిటర్నింగ్ వాల్ ఊసేలేదు. తాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలతోపాటు మత్స్యకారుల కడుపు కొడుతున్న తీర ప్రాంత పరిశ్రమల కాలుష్య నివారణ సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. వాటిని తప్పకుండా పరిష్కరించి తుని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను.

ప్ర. మీరు ఎమ్మెల్యే అయితే మహిళలకు మీరు ఇచ్చే ప్రాధాన్యం ఏంటి?

జ. మహిళలకు కచ్చితంగా ప్రాధాన్యం ఉంటుంది. ఒక ఇంట్లో మహిళ సఫలీకృతం అయితే ఆ ఇల్లు విజయవంతంగా ముందుకు వెళ్తుంది. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాను. అధికారంలోకి వచ్చాక మహిళా నర్సింగ్, మహిళా డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి మహిళా ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తాను. మహిళలకు స్వయం ఉపాధి కలిగేలా అవకాశాలు కల్పించి వారి ఉన్నతికి పాటుపడతాం.

ప్ర. కూటమి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజా స్పందన ఎలా ఉంది?

జ. కూటమి ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి. ప్రజలనుంచి మంచి స్పందన ఉంది. ఇంటింటా ప్రచారంలో ప్రతివిద్యార్థికి ఏటా రూ.15వేలు, మత్స్యకారులకు రూ.20వేలు, నిరుద్యోగులకు రూ.3నిరుద్యోగ భృతి, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రూ.4వేలు పెన్షన్ వృద్ధులకు, దివ్యాంగులకు రూ.6వేలు, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధులపై బాధపడేవారికి రూ.10వేలు పెన్షన్ అందించడంతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏటా రూ.20వేలు వంటి అన్ని పథకాలపై ప్రచారం చేస్తున్నాం.

ప్ర. ప్రచారంలో కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో మా బలం పెరిగింది. ప్రచారంలో మిత్రపక్షాల సహకారం ఎంతోఉంది. అందరం సమన్వయంతో ప్రచారం చేస్తున్నాం.

ప్ర. ప్రచారంలో మీ కుటుంబసభ్యుల సహకారం ఎలా ఉంది?

జ. నా భర్త, తండ్రి, మా అన్నలు.. ఇలా మా కుటుంబసభ్యులంతా ఎంతో సహకరించి ప్రచారం చేస్తున్నారు. వారి ప్రోత్సాహంతో ముందుకు వెళ్తున్నా.

లోవలో ఘనంగా జాతర





సాంస్కృతిక కార్యక్రమాలు

తుని రూరల్, మే7: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లోవకొత్తూరు గ్రామంలో అమ్మవారి అనుబంధ దేవాలయం ప్రాంగణంలో జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి తరలించారు. ఈ వేడుకను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకుని భక్తులకు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ సభ వద్ద విషాదం

సమీపంలోని స్లాబ్ కూలి వ్యక్తి మృతి..ఒకరికి గాయాలు



ప్రమాదం జరిగిన ప్రాంతంలో కూలిన స్లాబ్

సీతానగరం, మే 7: జగన్ ప్రచార సభ సీతానగరం మండలం, సింగవరం గ్రామంలో విషాదఛాయలు నింపింది. జగన్ సభకు సమీపంలోని జంబూపట్నం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వేసిన స్లాబ్ కూలి సింగవరం గ్రామానికి చెందిన మోర్తా శ్యాంకుమార్(22) మృతిచెందగా అదే గ్రామానికి చెందిన ముంగనూరి పృథ్వీరాజ్ తీవ్ర గాయలపాలై అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం కోరుకొండ గ్రామంలో జగన్ సిద్ధం సభ జరిగింది. ఈ సభకు సీతానగరం మండలం సింగవరం గ్రామం నుంచి పలువురు వెళ్లారు. సభా ప్రాంగణం సమీపంలోని జంబూపట్నం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉండగా స్లాబ్ కూలిపోవడంతో సింగవరం గ్రామానికి చెందిన మోర్త శ్యాం కుమార్ మృతిచెందగా పృథ్వీరాజ్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోర్తా శ్యాంకుమార్ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా పృథ్వీరాజ్ కాకినాడలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శ్యాంకుమార్ మృతి చెందడంతో సీతానగరం మండలం సింగవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి



108 రకాల స్వీట్లతో సారె

పిఠాపురం, మే 7: పిఠాపురం పట్టణంలో కొలువై ఉన్న గొల్లమారెమ్మతల్లికి మహిళలు సారె సమర్పించారు. మిరపకాయల వీధికి చెందిన మహిళలు 108 రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, వివిధ రకాల పిండివంటలను తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి తీసుకువచ్చారు.

మర్రిపాక గ్రామంలో స్టిక్కర్ వివాదం

జగ్గంపేట, మే 7: కాకినాడ జిల్లా మర్రిపాక గ్రామంలో మంగళవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం జగన్ స్టిక్కర్‌ను అతికించడంతో వివాదం రేగింది. వైసీపీ నేతలు స్టిక్కర్ అతికించడంతో టీడీపీ నేతలు జెండాలు కట్టారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొన్ని ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించడంతో గ్రామంలో వాతావరణం వేడెక్కింది. విషయం తెలుసుకున్న ఎన్నికల సిబ్బంది వాటిని తొలగించారు. దీంతో అధికారులతో వైసీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. స్టిక్కర్లు అతికించడాన్ని ఒప్పుకునేదిలేదని టీడీపీ నేతలు నినదించారు. ఆర్వో వెంటనే మర్రిపాక చేరుకున్నారు. స్టిక్కర్లు అతికించడానికి ఉన్న అనుమతి లేఖలను చూపించాలని అడిగారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అతికిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సీఐ లక్ష్మణరావు తెలిపారు.

అభ్యర్థితో.. ఒకరోజు

అటు ప్రణాళికలు..

ఇటు ప్రచారాలు..

- కాకినాడ పార్లమెంటరీ పరిధిలోని నియోజకవర్గాల్లో కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ చురుగ్గా ప్రచారం
- అసెంబ్లీ అభ్యర్థులతో కలిసి సమన్వయంతో ముందుకు..

కార్పొరేషన్(కాకినాడ), మే 7: మరో ఐదు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాలైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఒకవైపు పవన్ ధైర్యం, మరో వైపు చంద్రబాబు విజన్, కేంద్రంలో మోదీ ప్రభంజనంతో ఆయన అలుపెరగకుండా ప్రచారం కొనసాగిస్తున్నారు. క్షణం తీరిక లేకుండా బిజీబిజీగా ఉన్న ఉదయ్‌శ్రీనివాస్‌తో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒక రోజు' నిర్వహించింది.

ఉదయం వ్యాయామం.. ప్రచార వ్యూహరచన



కాకినాడ విద్యుత్‌నగర్‌లోని నివాసంలో ఉదయం పేపర్ చదువుతూ..

కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్ కాకినాడ విద్యుత్‌నగర్‌లోని జనసేన కార్యాలయంలోనే నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 5గంటలకే ఆయన నిద్రలేచారు. గంటపాటు వ్యాయామం చేశారు. అనంతరం టీ తాగి కాసేపు పేపర్ చదువుతూ ప్రచార వ్యూహరచన చేశారు. అల్పాహారం తీసుకుని ప్రచారానికి సిద్ధమయ్యారు. 9గంటలకే ప్రచారానికి సిద్ధమైన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, ప్రైవేట్ ఉద్యోగులు, సంఘ నాయకులను కలిసి వ్యూహాలపై సమాలోచనలు చేశారు. ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు ఇంటి వద్దే నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై వారితో మాట్లాడారు. అనంతరం ప్రచార వాహనాలపై కాకినాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలను కలిసేందుకు బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం 2గంటల వరకు కాకినాడలోనే ప్రచారాల్లో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి చేరుకుని అరగంటపాటు మధ్యాహ్నం భోజనం విరామం తీసుకున్నారు.



వీరమహిళలతో ఉదయ్‌శ్రీనివాస్

కరపలో ఎమ్మెల్యే అభ్యర్థి నానాజీతో కలిసి ప్రచారం

మధ్యాహ్నం 2.30గంటలకు బయలుదేరి కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండలంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నడకుదురు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. అక్కడ భారీ జనస్పందన కనిపించింది.

సామర్లకోటలో ప్రచారం



సామర్లకోట మండలం పి.వేమవరంలో పుష్పగుచ్ఛంతో నాయకుల ఆహ్వానం

అక్కడినుంచి సాయంత్రం 5 గంటలకు పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట మండలంలో ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడ జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పి.వేమవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 7 గంటల వరకు ఈ ప్రచారం జరిగింది.

8గంటలకు ముగింపు



కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఇంట్లో అభిమానులు తీసుకొచ్చిన పోస్టర్ ఆవిష్కరిస్తూ..

ప్రచారం ముగించుకుని రాత్రి 8గంటలకు కూటమి పార్లమెంట్ అభ్యర్థి ఉదయ్ కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి వద్ద వేచి చూస్తున్న కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. అయా గ్రామాల్లో చేయాల్సిన ప్రచారాలపై చర్చించారు.



కార్యకర్తలతో ఫోన్‌లో మాట్లాడుతూ..

కాకినాడ పార్లమెంటరీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాజమహేంద్రవరం బహిరంగ సభకు సోమవారం విచ్చేసిన ప్రధాని మోదీ సైతం తనను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారన్నారు. తన గ్యారెంటీతో, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో జాతీయ రహదారులు పూర్తయితే ఫిషింగ్ హార్బర్, కాకినాడ పోర్టుకు కనెక్టివిటీ సులువవుతుందని మోదీ తెలియజేశారన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు కూటమిని గెలిపించుకోవాలి

కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు



క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, మే 7: రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా కూటమిని గెలిపించుకోవాలని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వనమాడి కొండబాబు కోరారు. స్థానిక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కొండబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమవేశంలో క్షత్రియ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ డివిజన్ల నుంచి పెద్దసంఖ్యలో యువకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన పీవీబీ జయరామ్, ఆయన అనుచరులకు కొండబాబు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కొండబాబు సూచించారు. అభ్యర్థి వనమాడి కొండబాబు సీరియల్‌పై ఓటర్లకు అవగాహన కల్పించేం దుకు పార్టీ బూత్ ఇన్‌చార్జిలకు డమ్మీ ఈవీఎం బ్యాలెట్ ప్యాడ్‌లు అందజేశారు. వర్షం పడుతున్నా స్థానిక గోల్డ్ మార్కెట్ ఏరియాలో టీడీపీ నాయకులు గొడుగులు వేసుకుని ప్రచారం సాగించారు. గోల్డ్‌షాపుల యజమానులను, తాకట్టు వ్యాపారులను కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి కొండబాబుకు సైకిల్ గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గ్లాసు గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు గ్రంధి నారాయ ణరావు(బాబ్జి), టీడీపీ నాయకులు అమన్‌జైన్, బొబ్బిలి గోవిందు, ఈపి నాయుడు, దవులూరి భద్రరావు పాల్గొన్నారు. జనసేన కాకినాడ పార్లమెంట్ ప్రచార కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు కూటమి అభ్యర్థులను గెలిపించాలని పర్లోవపేటలో ప్రచారం సాగించారు. స్థానిక హనుమాననగర్, సంజయ్‌నగర్‌లో టీడీపీ నాయకులు గంపల లక్ష్మణరావు, దిబ్బాడ పోలరాజు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

'దోచుకోవడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్'

కాకినాడ సిటీ, మే 7: ప్రజల ఆస్తులను దోచుకోవడానికి జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చాడని, ప్రజల ఆస్తులను దోచుకోవడానికి కుట్రలు పన్నుతున్న వైసీపీ దోపిడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి చంద్రన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవడానికి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 33వ డివిజన్‌లోని కొత్తపేట మార్కెట్, కామేశ్వరినగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. వైసీపీ పాలనలో నిత్యావసర వస్తువుల అధిక ధరలు, పన్నుల భారంతో ప్రజలను జలగల్లా పీల్చి దోచుకున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి వైసీపీ మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ సారథ్యంలో చంద్రన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని వ్యాపారులను కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు కేతా శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, మాజీ కార్పొరేటర్ గుజ్జు దుర్గ లక్ష్మణరావు అవ్వా సత్యనారాయణ, ఎస్కే కస్సూర్, సరగడ వెంకటరమణ, జీడి రత్నం, అబ్దుల్ రహీం, ఎండీ గౌస్ పాల్గొన్నారు.





33వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొండబాబు, టీడీపీలో చేరినవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కొండబాబు

పవన్ గెలుపును ఎవ్వరు అడ్డుకోలేరు : వర్మ



పిఠాపురం రోడ్‌షోలో మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 7: అధికార వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా పిఠాపురంలో జనసేన అధినేత పవన్ గెలుపును ఎవ్వరు అడ్డుకోలేరని, లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పవన్‌కు మద్దతుగా పిఠాపురంలో వర్మ ఆధ్వర్యంలో మంగళవారం భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ర్యాలీలో వర్మ మాట్లాడుతూ రెండు ఓట్లు గాజుగ్లాసు గుర్తుపై వేసి జనసేనను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశం గర్వపడే విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పవన్‌కు మద్దతుగా పట్టణంలోని సీతయ్యగారితోటలో బీజేపీ నేతలు ప్రచారం నిర్వహించారు. బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల దొరబాబు, మోకా వెంకట సుబ్బారావు, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రాజు, పిఠాపురం పట్టణ అధ్యక్షుడు

పవన్‌కు మద్దతుగా ప్రచారం

పసుపులేటి సత్యనారాయణ, చిట్టా మధు, తోట ఏడుకొండలు, దోనే అచ్యుతరామయ్య, బుర్రి మురళీధరరావు, ఓలేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరగిరి: తన భర్తకు ఇచ్చిన ఆదరాభిమానాలను పిఠాపురం కూటమి అభ్యర్థి పవన్‌పై చూపాలని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి వర్మ ఓటర్లను అభ్యర్థించారు. ఆమె కొమరగిరిలో గుర్తు గాజు గ్లాసుపై ఓటేసి అఖండ విజయం చేకూర్చాలని మహిళలను అభ్యర్థించారు. మాజీ సర్పంచ్ కఠారి రాజబాబు, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్ కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు శ్రీరాములు పాల్గొన్నారు. వాకతిప్ప దళితపేటలో జనసేన నేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, నాగులాపల్లిలో టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, కొత్తపల్లిలో జనసేన నాయకుడు రావు అక్షయ్ ఆధ్వర్యంలో పవన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని 19వ వార్డులో పవన్‌కు మద్దతుగా జబర్దస్త్ నటుడు అశోక్, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

'పవన్ ప్రచారంతో మరింత జోష్'

తుని రూరల్, మే 7: ఇటీవల తునిలో పవన్ చేపట్టిన ప్రచారంతో కూటమి పార్టీలలో మరింత జోష్ సంతరించుకుందని జనసేన నాయకులు తెలిపారు. తునిలో విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధువీరేష్, కోఆర్డినేటర్ గణేష్,చినబాబు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌లకు కంట్రోల్ రూమ్

కార్పొరేషన్(కాకినాడ), మే 7: ఓటరు సమాచార స్లిప్ అందకపోతే అటువంటి ఓటర్ల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ ప్రగతిపై ఎన్నికల సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. కాకినాడ నియోజకవర్గంలో 234 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. సిటీ నియోజకవర్గంలో ఓటరుగా ఉండి ఓటరు సమాచార స్లిప్పు అందకపోతే కంట్రోల్ రూమ్ 08842349400కు కాల్ చేస్తే పూర్తి సమాచారమిస్తారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ కాల్‌సెంటర్ పనిచేస్తుందని ఆయన తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

అన్నవరం, మే 7: విశాఖపట్నానికి చెందిన ప్రేమజంట మంగళవారం గ్రామశివారున ఉన్న ప్రైవేటు లాడ్జిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖపట్నంలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎస్.హర్షవర్ధన్(25), ఆన్‌లైన్ ప్రోడక్ట్స్ విక్రయిస్తున్న యువతి(24) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. హర్షవర్ధన్‌కు ఇదివరకే వివాహం కావడంతో పెద్దలు అంగీకరించరనే కారణంతో సోమవారం రాత్రి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. బుధవారం ఉదయం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. చికిత్స పొందుతూ వారు కోలుకుంటున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు.

అన్నవరం ఘాట్‌రోడ్‌పై మరమ్మతులు

అన్నవరం, మే 7: సత్యదేవుడి సన్నిధికి వెళ్లే ఎగువ ఘాట్‌రోడ్‌పై మంగళవారం నుంచి గురువారం వరకు వాహనాలకు అనుమతిని తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 2002లో నిర్మించిన ఈ ఘాట్‌రోడ్డు మరమ్మతులకు గురై రోడ్డుపై గుంతలు పడడంతో సుమారు రూ.40 లక్షలతో పూర్తిస్థాయిలో ఒక లేయర్ తారురోడ్డుగా పనులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గురువారం నుంచి వాహనాలు యథావిధిగా కొండపైకి చేరుకోవచ్చునని తెలిపారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

కాకినాడ సిటీ, మే 7: బ్రిటీష్ కాలం నాటి దోపిడీ, పీడనలు నేటికీ కొనసాగుతున్నాయని, దేశ ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని ఐఎఫ్టీయూ నాయకులు పిలుపు నిచ్చారు. పర్లోవపేట పూలేకాలనీలో మంగళవారం అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సభ ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.రాజు, జి.రాజ్‌కుమార్, ఎం.భైరవస్వామి, కె.నరసింహ, బొడ్డు సత్యనారాయణమూర్తి, శ్రీపాదం సత్తిబాబు, పాల్గొన్నారు.

పోర్టుసిటీ(కాకినాడ): విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని సీతారామరాజు స్మారక కళావేదిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎస్ఆర్‌టీ ఇంజనీర్స్ అధినేత బీఆర్ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్‌లోని సీతారామరాజు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు కర్రి అచుతరామారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో గణపతిరాజు, జోగి జగన్నాథరాజు, క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు అడ్డూరి రామభద్ర భాస్కరరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, ఎస్‌మూర్తి ఉన్నారు.

జగ్గంపేట: మర్రిపాకలో అల్లూరి విగ్రహానికి ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, డాన్ శ్రీను పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో కామ్రేడ్ వినోద్ మిశ్రా నగర్‌లో సీతారామరాజు విగ్రహానికి సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొసిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సీఐటీయూ నాయకులు పిల్లా రాంబాబు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఏగుపాటి అర్జునరావు నాయకత్వంలో ఏలేశ్వరం, భద్రవరం, జె.అన్నవరం, పెద్దనాపల్లి గ్రామాల్లో అల్లూరికి నివాళులర్పించారు.

పిఠాపురం: పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో అల్లూరి చిత్రపటానికి సహృదయ మిత్రమండలి ప్రతినిధులు నివాళులుర్పించారు. మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ రచించిన సూర్యకిరణాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ విశ్రాంత డీడీ కె.అప్పారావు, సోమసుందర్ లిటరరీ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ గజరావు సీతారామస్వామి, మేకా మన్మథరావు, వి.సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

గొల్లప్రోలు రూరల్: వన్నెపూడి-కొడవలి జంక్షన్ వద్ద అల్లూరి విగ్రహానికి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ నివాళులర్పించారు. నక్కా బద్రి, నారాయణమూర్తి, ఎమ్.రామకృష్ణ ఉన్నారు.

అపర్ణాదేవికి విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 7: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం, అమావస్య, అశ్విని నక్షత్రం సందర్భంగా కుంకుమపూజలు జరిగాయి. మల్లెలు, సంపెంగలు, లిల్లీలు, గులాబీలు, కనకాంబరాలు, చేమంతులు, మందారాలు, విరజాజులతో అపర్ణాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు.

సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం

జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 7: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం, మేనిఫెస్టోతో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మంగళవారం జగ్గంపేటలో చైతన్య రథంపై భారీ ప్రజాస్పందన నడుమ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టి సూపర్‌సిక్స్ పథకాలు, ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. నెహ్రూ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనను ప్రజలందకూ చూశారని, వైసీపీ శ్రేణులు ఒక్క అభివృద్ధి పని చేయలేని అసమర్థ పాలకులని దుయ్యబట్టారు. మీట నొక్కడమే గానీ లబ్ధిదారులకు న్యాయం జరిగిందేమీ లేదన్నారు. చివరకు ఎన్నికల్లో విజయం కోసం పండుటాకుల ప్రాణాలతో రాజకీయం చేసే స్థాయికి దిగజారిపోయారని విమర్శించారు. బ్యాంకు అకౌంట్లో పింఛన్లు పడతాయన్న భరోసా కూడా నేతలు కల్పించకపోవడంతో అన్ని పథకాలు లాగానే ఫించన్ డబ్బులు పడ్డాయా లేదా అన్న అనుమానం వృద్ధుల్లో ఎక్కువైందన్నారు. ఇదీ ఈ ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న విశ్వాసం అని ఎద్దేవా చేశారు. ఎన్డీయేని ఎదుర్కొనే సత్తా లేక వలంటీర్లను తొలగిస్తారని, పథకాలు రద్దు చేస్తారని అసత్యప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ నియంతృత్వ పోకడలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఎన్డీయే హయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో సంక్షేమ రాజ్యం రానున్నదని ఆయన చెప్పారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, నియోజకవర్గంలో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాకు సైకిల్‌గుర్తుపై, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపైన ఓటు వేసి అత్యధికమెజార్టీతో గెలిపించాలని నెహ్రూ పిలుపునిచ్చారు. విద్యావైద్యం, సాగు, తాగునీరు, ఉద్యోగ, ఉపాధి నాలుగు అంశాలు ప్రమాణికంగా రాబోయే ఐదేళ్ల పరిపాలన చేస్తానన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. జ్యోతుల నెహ్రూకు మద్దతుగా పద్మనాభనగర్‌లో మంగళవారం రాత్రి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ప్రచారం చేశారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర పాల్గొన్నారు. నెహ్రూకు జగ్గంపేటలోని ఎస్సీపేటలో పెద్దలు, యువకులు బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ నేత దాట్ల కృష్ణవర్మ, టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తోలిగంటి ప్రవీణ్‌రెడ్డి, నేదూరి గణేష్, జనపరెడ్డి విష్ణు, కోరాడ బాబూరావు, దంత శివ యేసు తదితరులు ఉన్నారు.



జగ్గంపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న జ్యోతుల నెహ్రూ, ప్రచారంలో నెహ్రూకు హారతులు పడుతున్న దృశ్యం



ప్రచారంరథంపై బాలుడితో జ్యోతుల నెహ్రూ

పలుచోట్ల భారీ వర్షం

» చల్లబడ్డ వాతావరణం » సేదతీరిన ప్రజానీకం

పిఠాపురం/గొల్లప్రోలు/అన్నవరం/కరప/కిర్లంపూడి/జగ్గంపేట/గండేపల్లి/ ప్రత్తిపాడు, మే 7: జిల్లాలో మంగళవారం పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి వాతావరణంలో ఆకస్మిక మార్పులు కలిగాయి. ఉదయం ఎండకాసినప్పటికి 8గంటలు నుంచి చినుకులు ప్రారంభమయి వర్షం కురిసింది. తదనంతరం చినుకులు సాయంత్రం వరకూ కొనసాగాయి. ఎండకాస్తుండగానే కొన్ని సార్లు వర్షం పడింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. నెల రోజులకు పైగా ఎండతీవ్రతతో అల్లాడిన ప్రజలు సేదతీరారు. మరోవైపు వర్షం పడుతుండానే అన్ని పార్టీల నేతలు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఆకాల వర్షంతో గ్రామాల్లో పొలాల్లో ఉండిపోయిన వరి పనులు, ధాన్యం రాశులు వర్షానికి తడిచిపోయాయి. ధాన్యం, పనులు తడిచిపోవడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. అన్నవరం కొండపై కురిసిన వర్షపునీటితో మెట్లమార్గం, ఘాట్‌రోడ్డు మార్గం జలపాతాన్ని తలపించాయి. మెట్టప్రాంతాలపై జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. కరప మండలం వాకాడ, వలసపాకల, పెనుగుదురు, తదితర గ్రామాల్లో జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జేడీఏ) ఎన్.విజయకుమార్ పర్యటించి తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు జారీచేశారు. రైతులు అయినకాడికి అమ్ముకుని నష్టపోవద్దన్నారు. పడిపోయిన చేలల్లో మొలక రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అకాల వర్షానికి తడిసి పోయిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని రైతులు జేడీఏను కోరారు.



గొల్లప్రోలులో వర్షంతో రోడ్లపై నిలిచిపోయిన నీరు



కరప: వాకాడలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేడీఏ

రెల్లి కుటుంబాలకు అండగా టీడీపీ : యనమల రామకృష్ణుడు

తుని రూరల్, మే 7: రెల్లి కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుందని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో తేటగుంట శివారు రెల్లి కాలనీకి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. యనమల రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని, కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొల్లు సత్తిబాబు, పేరూరి కృష్ణ, గజ్జి రాంబాబు, కోన కన్నారావు, చామంతి సత్తిబాబు, గొర్ల వీరబాబు తదితరులున్నారు.



టీడీపీలో చేరినవారితో యనమల రామకృష్ణుడు

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

పెద్దాపురం కూటమి అభ్యర్థి చినరాజప్ప

ఆర్‌బీ కొత్తూరు, ఆర్‌బీపట్నంలో ప్రచారం

పెద్దాపురం, మే 7: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని ఆర్‌బీ కొత్తూరు, ఆర్‌బీపట్నం గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆయనకు హారతులు ఇచ్చారు. అనంతరం రాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎప్పుడూ తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనుక బడిందని మళ్లీ కూటమి అధికారం చేపట్టడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మెరుగుపడుతుదన్నారు. కూటమికి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమే అని, వైసీపీకి ఓటమి ఖరారయ్యిందన్న భయం పట్టుకుందన్నారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు, తమ పిల్లల బాగుకోసం టీడీపీకి ఓటువేయాలని అన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచన చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పెనుమర్తి దొరబాబు, కల్తూరి శ్రీనివాస్, మన్యం ప్రసన్నకుమార్, సానివీన సురేష్ నూనే రామారావు, యెండ్రు రామారావు తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌ని గద్దె దించండి'

సామర్లకోట, మే 7: బాధ్యత లేకుండా అవినీతి పాలన కొనసాగించిన జగన్‌రెడ్డిని గద్దె దించాలని, ప్రతీ ఒక్కరూ ఓటును వినియోగించుకుని టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చేయిచేయి కలపాలని పెద్దాపురం కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రజలకు పిలుపునిచ్చారు. సామర్లకోటలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే చినరాజప్ప విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాగునీరు లేక రైతులు కూడా పొరుగు రాష్ట్రాలకు వలసలు పోయే దుస్థితి ఈ రాష్ట్రంలో నెలకొందన్నారు. నిరుద్యోగ యువత పరిస్థితి మరీ దారుణంగా మారిందన్నారు. రాష్ట్రంలో కొత్త కంపెనీలు రాక, ఉన్న పరిశ్రమలకు అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తామని చెప్పారు. రైతులను జగన్‌రెడ్డి ప్రభుత్వం నిలువునా ముంచేసిందన్నారు. మద్దతు ధరల స్థిరీకరణ కోసం రూ.3వేల కోట్లతో గిట్టుబాటు ధరలు కల్పిస్తామని జగన్ మోసం చేశారన్నారు. తుఫాన్లతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. చంద్రబాబు పాలనలో గోదావరి జలాలను సమృద్ధిగా సరఫరా చేసేందుకు డెల్టా ఆధునీకరణ పనులు నిర్వహించడం ద్వారా వ్యవసాయోత్పత్తులను పెంచడంలోనూ, మద్దతు ధర కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని చినరాజప్ప ప్రజలకు భరోసా ఇచ్చారు.



పెద్దాపురం మండలం ఆర్‌బీపట్నం గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చినరాజప్ప దృశ్యాలు



సామర్లకోటలో పర్యటిస్తున్న చినరాజప్ప

పోస్టల్ బ్యాలెట్ ద్వారా 12,329 ఓట్లు : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 7: జిల్లాలో మూడురోజులుగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లలో 12,329మంది ప్రభుత్వ ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. మంగళవారం కాకినాడ పీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో జరుగుతున్న తొలిరోజు జిల్లాస్థాయి పోస్టల్ ఓటింగ్ నిమిత్తం చేసిన సదుపాయాలను పోలింగ్ సరళిని కలెక్టర్ ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోలింగ్ బూత్‌ల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఉద్యోగులకు వచ్చిన సందేహాలను స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. నాలుగురోజులుగా పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం ఉద్యోగులకు ఫెసిలిటేషన్ కల్పిస్తామన్నారు. ఇతర జిల్లాలో ఓటుహక్కు కలిగి కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న 4,179మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ నిమిత్తం జిల్లా ఫెసిలిటేషన్ సెంటర్‌లో 13 పోలింగ్‌బూత్‌లు, 11 వెరిఫికేషన్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క పోలింగ్ బూత్‌కి 70మంది ఓటర్లు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం కొన్ని నియోజకవర్గాలు, మధ్యాహ్నం కొన్ని నియోజకవర్గాలుగా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి నాగార్జున, త్రినాథ్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ఎస్పీ

కాకినాడ క్రైం, మే 7: కాకినాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌లో ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ మంగళవారం తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు గొడవలు, అల్లర్లకు దూరంగా ఉంటూ గ్రామాల్లో అందరూ ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేందుకు ప్రతిఒక్కరూ పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు.

'ఓటు హక్కు వినియోగించుకోవాలి'

సర్పవరం జంక్షన్, మే 7: ఎన్నికల విధుల్లో పాల్గొనున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేసి సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. మంగళవారం కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు.

'వైసీపీని శాశ్వతంగా తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం'

పిఠాపురం/గొల్లప్రోలు, మే 7: వైసీపీని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలో పడాల వీరబాబు, సయ్యద్ అజాద్ జమీర్ ఆధ్వర్యంలో కొత్తెం సత్యనారాయణ, సీతారాం, మధు, శ్రీను, సుదీర్, దత్తు, బాబూరావు, రాంబాబు, చినబాబు, సునీల్ చెల్లుబోయిన కృష్ణ, రవి, చరణ్, చుక్కా గోవిందరాజు సహా పలువురు మంగళవారం రాత్రి నాగబాబు సమక్షంలో జనసేనలో చేరారు. ఆయన మాట్లాడుతూ పవన్ గెలుపు ఖరారైందని, పోలింగ్ తేదీ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసానికి వివిధ వర్గాల ప్రజలు తరలివచ్చి నాగబాబును కలిసి తమ సంఘీభావం తెలిపారు. గొల్లప్రోలు మండలానికి చెందిన ఎన్నారైలు చిక్కాల వంశీ, కీర్తిశ్రీ ఇతర మిత్రబృందం ఆయన్ను కలిసి జనసేన పార్టీకి రూ.7లక్షలను విరాళంగా అందజేయగా నాగబాబు అభినందించారు. కాగా నరసాపురం, పాయకరావుపేట, జగ్గంపేటకు చెందిన పలువురు జనసేన పార్టీలో చేరారు.



నాగబాబును కలిసి జనసేనకి విరాళం అందిస్తున్న ఎన్నారైలు

'ల్యాండ్ టైటెలింగ్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలి'



ఏలేశ్వరంలో వినతి అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఏలేశ్వరం, మే 7: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిబ్బంది డి.గుమస్తా సూర్యప్రకాష్, బొడ్డు చిన్నారిలకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, సుబ్బరాజు, కొప్పుల బాబ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, బుద్దా సూర్యప్రకాశరావు, బస్సా ప్రసాద్ తదితరులున్నారు.

సామర్లకోట: వైసీపీ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని సామర్లకోట పట్టణ టీడీపీ నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది హరికి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.

కిర్లంపూడి: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో నాయకులు కిర్లంపూడి తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. టీడీపీ నాయకులు కుర్ల చినబాబు, ఆళ్ల బాబులు, ఆళ్ల నానాజీ, మళ్ల రమేష్, సూరిబాబు పాల్గొన్నారు.

శంఖవరం: ప్రజల భూ హక్కు హరించాలని చూస్తే తిరగబడి ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట జీవో కాపీలను చించేసి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. టీడీపీ నేతలు పర్వత సురేష్, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, బద్ది రామారావు, ఓలేటి లక్ష్మీనారాయణ, బద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: టీడీపీ నాయకులు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, అమరాది వెంకట్రావు, రొంగల సత్యనారాయణ, సూర్నీడి సురేష్, అడ్డా త్రిమూర్తులు,దంతులూరి బోసు పాల్గొన్నారు.

తాళ్లరేవు: టీడీపీ, జనసేన నాయకులు తాళ్లరేవు రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగసూర్యనారాయణ, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, రేళ్ల శ్రీనివాస చక్రవర్తి, వాసంశెట్టి శ్రీనివాస్, కుడిపూడి దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

కూటమి గెలుపు ప్రజల భవిష్యత్‌కు మలుపు : సత్యప్రభ



ప్రత్తిపాడు: ప్రచారంలో సత్యప్రభ, సత్యప్రభకు గజమాల వేస్తున్న నాయకులు, రౌతులపూడి:ప్రచారం చేస్తున్న తర్షిత్

ప్రత్తిపాడు, మే 7: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి గెలుపు ప్రజల భవిష్యత్‌కు మలుపు అంటూ ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సత్యప్రభ మాట్లాడుతూ మే13న జరిగే ఎన్నికల్లో తనకు సైకిల్‌గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ధర్మవరంలో నంది సెంటర్ వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ మండలాధ్యక్షుడు బొల్లు కొండబాబు, సొసైటీమాజీ అధ్యక్షులు దాట్ల అప్పన్నబాబు, దాట్ల కృష్ణబాబు, టీడీపీ నాయకులు ఇంధన ఏసుబాబు, బొండాడ నారాయణ, బొల్లు చిన్ని, వెంకటలక్ష్మి ఘన స్వాగతం పలికారు. రాచపల్లిలో అన్నవరం దేవస్థానం మాజీపాలక మండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజు ఆధ్వర్యంలో సత్యప్రభ ఇంటింటికి తరలివెళ్లి కూటమి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు, జనసేన నాయకులు వరపుల తమ్మయ్యబాబు, దాసం శేషారావు, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, పుణ్యమంతుల కామరాజు, కోలా తాతబాబు, సోమన్నదొర, కొప్పులసత్యనారాయణ,దంతులూరు బోసు పాల్గొన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఏలేశ్వరం నగర పంచాయతీకి చెందిన చిడగం శివ, శీరం రాంబాబు, చిడగం శ్రీను వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. పెదశంకర్లపూడి 5వ వార్డు మెంబర్ పోలవరపు తాతారావు అనుచరులు టీడీపీలో చేరారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర దళిత నాయకుడు ఆకుమర్తి చిన్నమాదిగ, సత్యప్రభ మాట్లాడారు.

రౌతులపూడి: వరుపుల సత్యప్రభ తనయుడు వరుపుల తర్షిత్ ఎస్.అగ్రహారంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టో వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా నాగశ్రీను, టీడీపీ నేత కిల్లాడ వరహాలు పాల్గొన్నారు. లచ్చిరెడ్డిపాలెం, రాజవరంలో జనసేన, టీడీపీ నేతలైన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మేడిశెట్టి సూర్యకిరణ్(బాబి), కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుబాస్, చింతకాయల రాజు, చిత్రా రెడ్డి, రాంబాబు నాగు, ప్రసాద్ సలీం కూటమి కోసం ప్రచారం చేశారు.

శంఖవరం: టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు ఆధ్వర్యంలో నెల్లిపూడికి చెందిన వైసీపీ కార్యకర్తలు కుక్కా చినసత్యనారాయణ, పెదసత్యనారాయణ, మడికి దొంగబాబు, దండోర సభ్యులు కుందూరి పెదనాగేశ్వరరావు ప్రత్తిపాడులో సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పర్వత సురేష్, వెన్నా శివ, బద్ది రమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ దాష్టీకానికి రాష్ట్రం బలి

కాకినాడరూరల్ కూటమి అభ్యర్థి నానాజీ

కరప, మే 7: సీఎం జగన్ దాష్టీకానికి రాష్ట్రం బలైపోయిందని కాకినాడ రూరల్ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) ఆరోపించారు. కరపమండలం గురజనాపల్లి, నడకుదురు, పెనుగుదురు, కరప గ్రామాల్లో మంగళవారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌లకు గాజుగ్లాసు గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. కూటమితోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని నమ్మి, కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తూరంగి పగడాలపేటకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు నానాజీ సమక్షంలో జనసేనపార్టీలో చేరారు. జనసేన నాయకుడు చోడిపల్లి గంగాధర్, గ్రామకమిటీ అధ్వర్యంలో 30మంది వరకు పార్టీలో చేరగా పంతం నానాజీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో మూడు పార్టీల నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, రంబాల వెంకటేశ్వరరావు, బండారు మురళి, బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబు, తుమ్మలపల్లి గోవిందరాజులు, తుమ్మలపల్లి మాచరరావు, రెడ్డిపల్లి నారాయణరావు, బండారు వెంకటేశ్వరరావు(ఇంజనీర్), కర్నాసుల పుష్పరాజు, పబ్బినీడి వెంకటకృష్ణ, చీపురుపల్లి జయేంద్రబాబు, తుమ్మలపల్లి కృష్ణ, తుమ్మలపల్లి వీరబాబు, పబ్బినీడి వెంకట్రావు, గంటా నానిబాబు, తదితరులు పాల్గొన్నారు. కరపలో నానాజీతో పాటు కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు, టీడీపీ నేత కటకంశెట్టి బాబి పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

సర్పవరం జంక్షన్: గొడారిగుంటలో జనసేన కార్యాలయంలో కాకినాడ రూరల్ పి.వెంకటాపురం గ్రామ ఉప సర్పంచ్, వైసీపీ నాయకుడు పెంకే సోమరాజు తన అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. 3వ డివిజన్‌కు చెందిన బీసీ నాయకుడు అనుసూరి నాగమల్లేశ్వరరావు అనుచరులతో పార్టీలో చేరారు. కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో బీసీ నాయకులు పెంకే సోమరాజు, అనుసూరి నాగమల్లేశ్వరరావు ఉన్నారు. కూటమి నాయకులు రాందేవు సీతయ్యదొర, కాకరపల్లి చలపతిరావు, పాలిక రమణ, యజ్జల బాబ్జీ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: రూరల్ మండలం తూరంగిలోని పగడాలపేటలో జనసేన గ్రామకమిటీ, గంగాధర్, వైసీపీ మత్స్యకార నాయకులు రాంబాబు ఆధ్వర్యంలో 30 మంది వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. కూటమి అభ్యర్థి పంతం నానాజీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కరప: నడకుదురులో గజమాలతో నానాజీకి స్వాగతం



కరప: పెనుగుదురులో నానాజీకి మహిళల కరచాలనం



కాకినా రూరల్: జనసేనలోకి ఆహ్వానిస్తున్న నానాజీ

ఎన్నికల పరిశీలకుల ప్రత్యేక పూజలు

సామర్లకోట, మే 7: ఎన్నికల కమిషన్‌కు చెందిన ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు బాలసుబ్రహ్మణ్యం, కమలాకాంత్ సరోచ్ మంగళవారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో బళ్ళ నీల కంఠం ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులకు స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదస్వస్తి పలికి ప్రసాదాలు అందజేశారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించాలి'

కోటనందూరు, మే 7: రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని 93 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర గణేష్‌బాబు కోరారు. మంగళవారం కెఎమల్లవరంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గణేష్‌బాబు మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ పెంటకోట బాస్కరసత్యనారాయణ, చింతకాయల రవి కుమార్, షేక్‌నవాబ్‌జానీ, కర్రి శ్రీను, రుత్తల రవి ఉన్నారు.

తోటపేటలో టీడీపీ ప్రచారం

తాళ్లరేవు, మే 7: తోటపేట గ్రామంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో దళిత నేతలు జక్కల ప్రసాద్‌బాబు, మోర్త భైరవమూర్తి, టీడీపీ నేతలు పూడా వెంకటరామకృష్ణ, సాదనాల శివరామకృష్ణ, ధూళిపూడి వెంకటరమణ, నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, రేవు గోవరాజు, జనిపల్లి ఈశ్వగరరావు, సాదనాల ప్రసాద్, దున్నా మహేంద్ర, ఉండ్రు దుర్గాప్రసాద్, రేవు లోవరాజు ఉన్నారు.

ద్వారంపూడి అనుచరుడిపై ఐటీ దాడుల్లో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

కాకినాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడిపై జరిగిన ఐటీ దాడుల్లో కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ కీలక నేత ఎవరెవరికీ ఎన్నికోట్లు పంచారో చిట్టా దొరికినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.3కోట్ల నగదు, 16 కిలోల బంగారం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కీలక డాక్యుమెంట్లలో వైసీపీ నేతలకు ఎన్నెన్ని కోట్లు ఇచ్చారో వెల్లడి కావడంతో వైసీపీ కీలక నేత వణికిపోతున్నట్లు తెలిసిందే.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

సామర్లకోట, మే 7: సామర్లకోట వేట్లపాలెం కెనాల్ రోడ్డులో మంగళవారం సాయంత్రం సామర్లకోట నుంచి వేట్లపాలెం వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి పక్కనే ఉన్న గోదావరి కాలువలోకి దూసుకుపోయింది. అయితే ప్రమాద సమయంలో కాలువలో నీరు అంతగా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్ వెంకట్రావు సమయస్ఫూర్తిగా వ్యవహరించి నీటిలో నుంచి బయటపడ్డాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ట్రాక్టర్‌ను సడన్‌బ్రేకులు వేయడంతో కాలువలోకి దూసుకుపోయింది. అటుగా వస్తున్న టిప్పర్ సాయంతో ట్రాక్టర్‌ను రోడ్డుపైకి చేర్చారు. సుమారు 2గంటలు కెనాల్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.